సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



పులి రాజా.. పారిపోతున్నాడు

ఎయిడ్స్‌ను మొన్నటి వరకూ పులిరాజాతో పోల్చేవారు. ఆ పులిరాజా ప్రస్తుతం ప్రజా చైతన్యంతో పారిపోతున్నాడు. నిరంతర చర్చ ద్వారా ఈ వ్యాధిపై అవగాహన పెరుగుతోంది.


8లో



కడలి కల్లోలం

కడలిలో కల్లోలం రేగింది.. అలల తాకిడి అధికమైంది.. ఫెంగల్ తుపాను ప్రభావంతో కొత్తపల్లి మండలంలో సముద్ర తీరం ఉధృతంగా మారింది.

17 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. గోదావరి డెల్టా కాలువలకు శనివారం 4,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఉద్యోగులకు ఏఏఎస్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ వర్మ

రాజమహేంద్రవరం రూరల్: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ జీవోల ప్రకారం ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఎస్) అమలు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. శనివారం బొమ్మూరులోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్‌వర్మ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రపురం వీఆర్వో పెనుమాక గనిరాజు మృతికి ఏపీజీఈఏ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోందన్నారు. అలాగే డిసెంబరు 14వ తేదీన జరపనున్న జిల్లా మహాసభ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ యూనియన్ నేతలు కర్రి దినేష్, ఏపీజీఈఏ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి కె.వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం నగర అధ్యక్ష, కార్యదర్శులు బివి.విజయ కుమార్, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

96 శాతం పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ శనివారం 96.06 శాతం పూర్తయ్యిందని డీఆర్‌డీఏ పీడీ మూర్తి తెలిపారు. మొత్తం 2,37,389 మంది లబ్ధిదారులకు రూ.101.63 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 2,28,032 మందికి రూ.97.55 కోట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5,128 మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

మూడు నెలల కాల పరిమితి దాటితే పింఛన్ కట్

కొవ్వూరు: మండలం తొగుమ్మి గ్రామంలో నిర్వహించిన సామాజిక ఫించన్‌ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె దివ్యాంగులైన తల్లి కొడుకులు తామరపల్లి నూకరత్నం, తామరపల్లి సంతోష్‌లకు స్వయంగా పింఛన్ అందజేశారు. అనివార్య కారణాల వల్ల తీసుకోవడం వీలుకాని లబ్ధిదారులకు మూడు నెలల వరకు బకాయిలు చెల్లిస్తామని, ఆ కాల పరిమితి దాటితే శాశ్వతంగా వారిని తొలగిస్తామని ఆమె తెలిపారు. అభ్యర్థన తేదీ నుంచి మూడు నెలల లోగా ఎలాంటి బకాయిలు లేకుండా రోల్‌బ్యాక్ పింఛను అందజేస్తామన్నారు. పెన్షనర్ మరణిస్తే జీవిత భాగస్వామికి పెన్షన్ ప్రామాణిక ఆపరేటింగ్ విధానంలో మంజూరవుతుందన్నారు. కార్యక్రమంలో ఆమెతో పాటు ఆర్డీవో రాణి సుస్మిత, ఎంపీడీవో కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యంలో
వసూల్ రాజా!

- అయన కనుసన్నల్లోనే రేటింగులన్నీ!
- చేయి తడపందే ఏ పనీ కాని పరిస్థితి
- సెలవులు, ట్రాన్స్‌ఫర్లను బట్టి రేటు ఫిక్స్
- అనుపత్రుల తనిఖీకి వెళితే పెద్ద పండగ వచ్చినంత సంబరం
- ప్రసూతి సెలవుకు సైతం రూ.3 వేలు
- మెడికల్ బిల్లులకైతే ఏకంగా రూ.10 వేలు

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి పనికీ ఓ ధర నిర్ణయించి మరీ ఓ ఉద్యోగి వసూళ్లకు పాల్పడుతున్నాడని, చేయి తడిపితే తప్ప ఫైలు ముందుకు కదలడం లేదని, లేదంటే కొర్రీలు తప్పడం లేదన్న చర్చ నడుస్తోంది.

సర్వీస్ రిజిస్టర్ నుంచి మెటర్నిటీ సెలవుల వరకు ఏ సేవలైనా చేతిలో పైసలు పడందే ముందుకు సాగడం లేదని అడ్డగోలు వ్యవహారం జరుగుతున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. కార్యాలయంలో ఓ ఉద్యోగి కనుసన్నల్లో ఈ అక్రమ దందా సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కోనసీమ వైద్య శాఖ వాట్సాప్ గ్రూపుల్లో అవినీతిపై చర్చ జరగడం చర్చనీయాంశంగా మారింది.

ప్రతి పనికీ ఓ రేటు..

వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాలన వ్యవహారాలు, వివిధ రకాల సేవలు అందించే డీఎం అండ్ హెచ్‌ఓ (జిల్లా వైద్య ఆరోగ్యశాఖ) కార్యాలయానికి అవినీతి రోగం పట్టుకుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసులు లేనిదే ఇక్కడ ఏ పనీ ముందుకు కదలడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్ నుంచి మెడికల్ బిల్స్ వరకు ఏ పని జరగాలన్నా జేబులు తడపాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఉద్యోగులు, సిబ్బంది అవసరాన్ని బట్టి ఒక్కొక్కరి నుంచి రూ.10



డీఎంహెచ్‌ఓ కార్యాలయం

వేలకు పైగా గుంజుతున్నట్లు తెలిసింది. ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్‌కు రూ.5 వేలు, ప్రొబేషన్ ఫైల్ కదిపేందుకు రూ.10 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రసూతి సెలవుల మంజూరుకు సైతం రూ.3 వేలు దండుకుంటున్నట్లు తెలిసింది. రాజమహేంద్రవరం నగరంలో ఉన్న ఆర్డీ ఆఫీస్‌కు ఉద్యోగుల ఎస్‌ఆర్ పంపేందుకు రూ.వెయ్యి వసూలు చేస్తున్నారంటే ఏ స్థాయిలో కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారో తెలుస్తోంది. కాంట్రాక్టు కార్మికుల కంటిన్యుయేషన్ ఆర్డర్‌కు రూ.వెయ్యి. అనారోగ్యం పాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు వెచ్చించిన మొత్తాన్ని రీయింబర్స్ చేసుకునేందుకు సైతం అమ్యామ్యాలు సమర్పించాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులకు ఒక్కొక్కరి నుంచి బిల్లును బట్టి రూ.2 నుంచి రూ.10 వేల వరకు అక్రమాలకు తెగబడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాసులు కురిపిస్తున్న తనిఖీలు!

జిల్లా అధికారులు పీహెచ్‌సీలకు తనిఖీలకు వెళ్తుంటారు. ఈ సందర్భంలో సైతం పీహెచ్‌సీలో అసౌకర్యాలు, ప్రజలకు వైద్యం అందకపోవడం లాంటి సమస్యలు బహిర్గతం కాకుండా చూస్తామని చెప్పి అక్రమార్కులు పీహెచ్‌సీల వైద్యుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రైవేట్ ఆస్పత్రులపై పర్యవేక్షణ ఏదీ..?

జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ధనార్జనే పరమావధిగా పనిచేస్తున్నాయి. రోగుల ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా రూ.వేలకు వేలు దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రికి వచ్చిన రోగులను సైతం పీడిస్తున్నారు. రోగుల భయాన్ని ఆసరాగా చేసుకుని అనవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి రూ.లక్షలు దోపిడీ చేస్తున్నారని నేరుగా రోగుల బంధువులే ఆరోపిస్తున్నారు. రోగులకు అవసరమైన వసతులు ఉండటం లేదు. ఈ వ్యవహారాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాల్సి ఉన్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం అందక మృతిచెందిన చిన్నారులు, రోగుల సంఘటనలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. అయితే సదరు ఆస్పత్రులపై ఇంత వరకూ చర్యలు తీసుకోలేదు. ఇటీవల నగరంలోని ఓ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో జిల్లా స్థాయి అధికారి (డీపీఓ) సరైన సమయంలో వైద్యం అందక మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ ఘటనపై స్వయానా జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశిస్తే.. విచారణకు వెళ్లిన వైద్యశాఖ అధికారులు తూతూ మంత్రంగా పరిశీలనలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

స్కానింగ్ సెంటర్లపై నిఘా ఏదీ?

జిల్లా వ్యాప్తంగా ప్రతి వీధిలో ఓ స్కానింగ్ సెంటర్ వెలిసింది. లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. రక్తం ఇతర వైద్య పరీక్షలకు ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. అయినా వారిపై తనిఖీలు, చర్యలు తీసుకోవడంలో వైద్యశాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అంతు చిక్కని ప్రశ్నగా మారుతోంది.

తవ్వకాలు జరపని సొసైటీల
అనుమతులు రద్దు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): డిసిల్టేషన్ పాయింట్ల ఆధ్వర్యంలో కనీస స్థాయిలో తవ్వకాలు జరిపే విధానం ఉండాలనీ, అధికారులు నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్, డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు. శనివారం స్థానిక కలెక్టరు క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లా పరిధిలో 140 బోట్స్ మ్యాన్ సొసైటీలకు డిసిల్టేషన్ పాయింట్ల వద్ద ఇసుక తవ్వకాలు జరిపేందుకు అనుమతులు మంజూరు చేసినట్టు తెలిపారు. సంబంధిత బోట్స్ మ్యాన్ సొసైటీ సభ్యులు జీవన భృతి కోసం చేసుకున్న విజ్ఞప్తిని అనుసరించి ఇసుక తవ్వకాలకు అనుమతులు జారీ చేశామని తెలిపారు. 48 గంటల్లో ఏ సొసైటీ రోజుకు ఎంత చొప్పున తవ్వకాలు జరిపారో నివేదిక అందచేయాలన్నారు. ఓపెన్ రీచ్‌లలో తవ్వకాలు, లోడింగ్ సమాంతరంగా చేపట్టాలని, డంపింగ్ చేయవద్దని ఆమె ఆదేశించారు. జిల్లాలో కొత్తగా నాలుగు ఓపెన్ రీచ్‌లను గుర్తించామని, వేమగిరి (కడియం), తీపర్రు (పెరవలి), పెండ్యాల (నిడదవోలు), పందలపర్ర (నిడదవోలు) జేసీ ఎస్.చిన్న రాముడు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్‌బీఎం మురళీ కృష్ణ, ఆర్డీవోలు ఆర్ కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలు అక్రెడిటేషన్ పొందాలి



శిక్షణలో పాల్గొన్న అటవీ, వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ విభాగాలకు చెందిన అధికారులు

రాజానగరం: రాష్ట్రంలోని ఆగ్రో ఫారెస్ట్రీ నర్సరీలకు అక్రెడిటేషన్ ప్రొటోకాల్‌పై దివాన్‌చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నర్సరీలకు అక్రెడిటేషన్ రేటింగ్ ఇవ్వడంలో భాగంగా ఈ శిక్షణా తరగతులు జరిగాయని ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్స్ ఇన్ ఇండియా స్టేట్ కో ఆర్డినేటర్ అజిత్ చలం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నర్సరీలు తప్పనిసరిగా అక్రెడిటేషన్ పొందాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ రాజమండ్రి సీసీఎఫ్ బీఎస్ మూర్తి, అకాడమీ డైరెక్టర్ విజయ్‌కుమార్, శాస్త్రవేత్త సురేష్ రామణ్, సిల్వి కల్చరిస్టు శ్రీనివాస్‌లతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అటవీ, వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాథమిక విద్యే కీలకం



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వాసుదేవరావు

రాజానగరం: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రాథమిక విద్యాబోధన చేసే ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. మల్లంపూడి సాయి మాధవి ఇంజినీరింగ్ కాలేజీ భవనంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. డీఈవో మాట్లడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యా బోధనలో చూపిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యాబోధనలో కూడా అనేక మార్పులు వస్తున్నాయన్నారు. వాటిని ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకోవాలని, నిత్య విద్యార్థిగా బోధనా సామర్థ్యాలు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీ శంకరరావు, కోనసీమ జిల్లా ఏఎల్‌ఎస్ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు, మండల విద్యాశాఖాధికారి జ్యోతిప్రసాద్, మాస్టర్ ఫెసిలిటేటర్లు, 190 ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు పాల్గొన్నారు.

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

- భారంగా మారిన 'అపార్' నమోదు
- ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) డిమాండ్ చేశారు. రాయవరం మండలం పసలపూడిలో జరుగుతున్న యూటీఎఫ్ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించేలోగా ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత పీఆర్సీకి సంబంధించి, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.22 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉండగా, వాటికి సంబంధించి బడ్జెట్‌లో ఏ విధమైన ప్రతిపాదనలు చేయకపోవడం దారుణమన్నారు. వీటి చెల్లింపునకు సరైన షెడ్యూల్ ప్రకటించాలన్నారు.



ఉపాధ్యాయ సంఘాలు, జేఏసీతో చర్చించి వెంటనే ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. గత ఆరున్నరేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నియమించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీఎస్సీ రోడ్డు మ్యాప్ వేయాలని, సిలబస్ ప్రకటించాలని ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. రాష్ట్రంలో 16,467 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. 117 జీవోను రద్దు చేసి, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేస్తే భర్తీ చేయాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి ముందుగానే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. అలాగే 117 జీవోను రద్దు చేసి, ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ప్రజాస్వామ్యయుతంగా నిర్ణయం తీసుకోవాలన్నారు.

'అపార్'మైన భారం

అపార్ నమోదు ఉపాధ్యాయులపై అధిక భారం మోపుతోందని, ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. అపార్‌ను నిమిషాలు, గంటల్లో పూర్తి చేయమని ఒత్తిడి తేవడం సమంజసం కాదన్నారు. అపార్ నమోదు సమయాన్ని పెంచాలని, ఈ ప్రక్రియను సరళతరం చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. అలాగే ఉపాధ్యాయులపై ఇప్పటికే ఉన్న యాప్‌ల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వానికి సూచించామన్నారు. ఉపాధ్యాయ పనిదినాలకు నష్టం లేకుండా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలన్నారు. కేవలం ప్రపంచ బ్యాంకు నుంచి తెచ్చిన అప్పుల కోసం అనివార్య పరిస్థితుల్లో శిక్షణ ఇస్తున్నారన్నారు. ఆయన వెంట యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్‌ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



నదీపాయలు.. ఇరువైపులా ఉండే మడ అడవులు



మగసానితిప్పకు పడవపై వస్తున్న అయ్యప్ప భక్తులు

అందం.. ఆహ్లాదభరితం

- మగసానితిప్పలో ఆధ్యాత్మిక పరవశం
- గోదావరి నదీపాయల మీదుగా పడవ ప్రయాణం
- మంత్రముగ్ధులను చేస్తున్న మడ అడవుల సౌందర్యం
- పర్యాటకంగా ప్రోత్సహిస్తే మంచి ఫలితం

సండే స్పెషల్

సాక్షి, అమలాపురం/ కాట్రేనికోన: గౌతమీ నదీ సాగర సంగమ ప్రాంతం. పాయలు.. పాయలుగా విడిపోయే నది. వాటిని అనుకుని ఇరువైపులా చిట్టిపొట్టి మొక్కలు.. చిక్కని గుబురు పొదలు. వాటి మధ్య సాగే పడవ ప్రయాణం. మడ పీతలు.. అందమైన పక్షులు.. అరుదైన వృక్షజాతులు.. ఔషధ మొక్కలు ఇలా దారి పొడవునా కనిపించే అందమైన సుందర దృశ్యాలు ఎన్నో మరెన్నో. బలుసుతిప్ప శివారు మగసానితిప్పకు వెళ్లే పడవ ప్రయాణం పైరు పచ్చని కోనసీమలో సరికొత్త అందాలను కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది. కొబ్బరి తోటలు.. పచ్చని పొలాలు.. పంట కాలువల అందాలనే కాదు.. మడ అడవులు.. నదీ పాయలు.. పడవ ప్రయాణాలు.. ఇలా 'స్వర్గమే కళ్లముందు' కదలాడుతోంది.

మగసానితిప్ప ఓ కుగ్రామం. గోదావరి నదీపాయలు, మడ అడవులు నడుమ ఒక చిన్న దీవి. కాట్రేనికోన మండలం బలుసుతిప్ప పంచాయతీ శివారు గ్రామం. అగ్నికుల క్షత్రియులు ఉండే ఆ గ్రామానికి వెళ్లాలంటే పడవ ఒక్కటే మార్గం. అటువంటి గ్రామంలో మత్స్యకారుల ఆరాధ్య దైవం కాల భైరవస్వామి ఇక్కడ కొలువై ఉన్నారు. ఈ ఆలయానికి సుమారు 1,800 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతున్నారు. గతంలో స్వామివారి ఆలయాన్ని సమీపంలో ఉన్న బలుసుతిప్ప గ్రామంలో చౌళరాజులు నిర్మించారని ఆలయ చరిత్ర చెబుతోంది. తుపాను సమయంలో మూలవిరాట్ సముద్రంలో



కాల భైరవస్వామి ఆలయం

కూరుకుపోతుండగా, మత్స్యకారులు అడ్డుకుని ఊరికి ఈశాన్యంగా ఉన్న మగసానితిప్పలో ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడ ఆలయం నిర్మించి వందేళ్లకు పైబడి అవుతోంది. తొలుత మత్స్యకార పద్దెలు పూజాదికాలు నిర్వహించగా, గత 80 ఏళ్లుగా బ్రాహ్మణుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు.

పెరిగిన తాకిడి

అతి పురాతన ఈ ఆలయానికి ఇటీవల కాలంలో భక్తుల తాకిడి పెరిగింది. గతంలో అప్పుడప్పుడు ఒకరిద్దరు భక్తులు మాత్రమే బయట నుంచి వచ్చేవారు. మహాశివరాత్రి నాడు మాత్రం పెద్ద ఎత్తున భక్తులు వచ్చేవారు. కానీ ఇప్పుడు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. మరీ ముఖ్యంగా కార్తిక మాసంలో రోజూ భక్తులు వస్తుండగా అయ్యప్ప, భవానీ మాలధారులు భారీగా వస్తున్నారు. ప్రతి నెలా అష్టమి రోజు ఇక్కడ గుమ్మడి కాయలో దీపం పెట్టడం వల్ల పాపాలు పోతాయని భక్తుల విశ్వాసం.

పర్యాటకంగా ప్రోత్సహించాలి

పర్యాటకంగా ప్రోత్సహిస్తే ప్రయాణికులు, భక్తుల సంఖ్య మరింత పెరగనుంది. ఏకో టూరిజంలో భాగంగా గతంలో పలు సందర్భాల్లో పర్యాటక బోట్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు వచ్చినా తరువాత పట్టించుకునేవారు లేకుండా పోయారు. బలుసుతిప్ప, జి.మూలపొలం నుంచి ప్రత్యేక పర్యాటక బోట్లు ఏర్పాటు చేయడం, మగసాని తిప్పలో సేద తీరేందుకు ఏర్పాట్లు చేస్తే పర్యాటక అభివృద్ధి జరుగుతుంది.

ముచ్చటగొలిపేలా..

ఈ గ్రామానికి వెళ్లేందుకు రెండు జల మార్గాలున్నాయి. ఒకటి బలుసుతిప్ప, రెండోది ఐ.పోలవరం మండలం జి.మూలపొలం నుంచి ఇంజన్ పడవల (బోట్లు) మీద రాకపోకలు సాగించాల్సి ఉంది. ఈ పడవల ప్రయాణం ఒక అద్భుతం. మనో ఫలకంపై చెరగని ముద్రగా నిలిచిపోతోంది అంటే అతిశయోక్తి కాదు. ఒంపులు తిరుగుతూ సాగే నదీపాయల మధ్య బోటు ప్రయాణం.. ఇరువైపులా దట్టమైన పొదరిల్లుగా అల్లుకుపోయిన మడ చెట్లు.. నీటి మీద తేలియాడే వాటి వేర్లు ముచ్చటగొల్పుతాయి. అడవుల్లో ఉండే ఔషధ మొక్కల నుంచి వచ్చే పరిమళాలు ప్రకృతి ప్రేమికులను మరో లోకానికి తీసుకుపోతాయి. చెట్ల కొమ్మల మీద పాకుతున్న మడ పీతలు.. అక్కడక్కడా కనిపించే మడ పిల్లులు.. విదేశీ పక్షులు కనువిందు చేస్తాయి. చిన్న కాలువలుగా.. వెంటనే పెద్ద నదిని తలపించే పాయలు.. తీరాన్ని అనుకుని గోదావరి దీవుల మధ్య సంప్రదాయ పద్ధతిలో జీవనం సాగించే అగ్నికుల క్షత్రియులు (మత్స్యకారులు). చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ మడ అడవుల్లో పీతలు, చేపల, రొయ్యల వేట ఆశ్చర్యాన్ని గురి చేస్తాయి. మడ అడవులను అనుకుని మత్స్య సంపద కోసం ఏర్పాటు చేసిన వలలు, వాటి వద్ద మత్స్యకారుల సందడి ముచ్చట గొల్పుతాయి. పడవలకు ఎదురుగా వచ్చే వేట పడవలు... రాకపోకలు సాగించే గ్రామస్తులు, గంటపాటు సాగే ప్రయాణంలో కంటిని కట్టిపడేసే అందచందాల గురించి ఎలా ఎన్ని చెప్పుకొన్నా.. ఎంత చెప్పుకొన్నా తక్కువే. ప్రకృతి ప్రేమికులు జీవితంలో ఒక్కసారైనా ప్రయాణం చేయాలనిపించే ప్రాంతం ఇది.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. దేవదాయ– ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజల ద్వారా దేవస్థానానికి రూ.1,73,025, అన్న ప్రసాద విరాళాలుగా రూ.48,839 వచ్చినట్టు ఈఓ తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్సై గరగారావు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ నుంచి బైక్‌పై ఓ వ్యక్తి వస్తుండగా స్థానిక ముత్యాలమ్మ ఆలయం సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొంది. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి క్షతగాత్రుడిని పరిశీలించగా అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఘటనా స్థలాన్ని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు పరిశీలించారు. అయితే మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

గండేపల్లి: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. దీనిపై ఎస్సై యూవీ శివ నాగబాబు కథనం ప్రకారం.. యల్లమిల్లి గ్రామానికి చెందిన కర్ణం నాగరత్నం (58), అతని కుమారుడు దుర్గారావుతో కలసి శనివారం మోటార్ సైకిల్‌పై తాళ్లూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చింది. అక్కడ స్వామివారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో వేరే మోటార్ సైకిల్ ఎక్కి నాగరత్నం ఇంటికి వెళ్తుండగా, తాళ్లూరు శివారులో అమ్మవారి ఆలయం సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా లారీ వేగంగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో నాగరత్నం తలపై నుంచి లారీ దూసుకుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ కేసు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పులి రాజా.. పారిపోతున్నాడు

- తగ్గుముఖం పట్టిన హెచ్‌ఐవీ కేసులు
- ప్రభుత్వాల కృషితో సత్ఫలితాలు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం



రాజమహేంద్రవరం రూరల్: ఒకప్పుడు ఎయిడ్స్‌ను పులిరాజాతో పోల్చేవారు. ఈ యాడ్ సామాజిక మాధ్యమాల్లో విశేష ప్రాచుర్యం పొందింది. అలాంటి పులి రాజా ప్రస్తుతం పారిపోతున్నాడు. మొన్నటి వరకూ ఎయిడ్స్‌పై నలుగురిలో మాట్లాడాలంటే వణుకు ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. దశాబ్దానికి ముందు చాపకింద నీరులా విస్తరించిన ఎయిడ్స్ మహమ్మారి వెనకడుగు వేస్తోంది. దీనికి ప్రభుత్వాలు చేసిన కృషి సత్ఫలితాలనిస్తోంది. ఎయిడ్స్ కూడా ఒక రుగ్మతే కదా అనే ధోరణి ప్రజల్లో వచ్చింది. దీనికితోడు ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమంటూ కొన్నాళ్లుగా ప్రభుత్వాలు చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. సురక్షితం కాని శృంగారం ఎంత ప్రమాదకరమో కరపత్రాల ద్వారా చాటి చెప్పడంతో క్రమంగా ప్రజల్లో చైతన్యం పెరిగింది. బహిరంగ చర్చ మొదలవ్వడంతో ఎయిడ్స్ వ్యాధి అదుపులోకి వచ్చింది. ఫలితంగా కొన్నేళ్లుగా ఈ మహమ్మారి తగ్గుముఖం పడుతోంది. ప్రతి ఏడాది డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం జరుపుకొంటున్నాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరం ప్రపంచ ఎయిడ్స్ దినం డిసెంబర్ 1న ఒక సూచికగా 'టేక్ ది రైట్స్ పాత్–మై హెల్త్ –మై రైట్' (హక్కుల మార్గాన్ని అనుసరించండి– నా ఆరోగ్యం– నాహక్కు) అనే నినాదంతో హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చింది. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా కథనం.

హెచ్‌ఐవీ అంటే..

హెచ్‌ఐవీ (హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్) అనేది ఎయిడ్స్ (ఎక్వైర్ ఇమ్యునో డెఫిషియన్సీ సిండ్రోమ్)ను కలగజేస్తుంది. ఈ వైరస్ లైంగికంగా, ఇన్ఫెక్షన్ సోకిన సూదులతో రక్తం ఎక్కించడం ద్వారా లేదా ఇన్ఫెక్షన్ సోకిన తల్లి నుంచి బిడ్డకు వ్యాపిస్తుంది. ఈ వైరస్ శరీరంలో రోగ నిరోధకశక్తిని బలహీనపరచి క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణింపజేస్తుంది.



రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు (ఫైల్)

జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ పరీక్షలు, సేవ, చికిత్స సదుపాయాలు

- సమగ్ర సలహా, పరీక్ష కేంద్రాలు ఐసీటీసీలు–పీపీటీసీటీలు: 5
- ఫెసిలిటీ ఇంటిగ్రేటెడ్ ఐసీటీసీలు (ప్రాథమిక ఆరోగ్య/పట్టణ ఆరోగ్య కేంద్రాలు : 48
- కమ్యూనిటీ బేస్డ్ టెస్టింగ్ కేంద్రాలు : 2
- ఏఆర్‌టీ కేంద్రం, (రాజమహేంద్రవరం) : 1
- లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు, (కొవ్వూరు, గోకవరం, నారీసాక్షం): 3
- సుఖవ్యాధుల చికిత్సా కేంద్రం (రాజమహేంద్రవరం): 1
- రక్తనిధి కేంద్రాలు (ప్రభుత్వ, ప్రైవేట్): 8
- రక్త నిల్వ కేంద్రాలు : 5
- టార్గెట్ ఇంటర్ వెన్షన్ సెంటర్ (స్వచ్ఛంద సేవా సంస్థలు): 2
- లింక్ వర్కర్స్ ప్రాజెక్టు (26 గ్రామాల్లో): 1
- కేర్ సపోర్ట్ సెంటర్స్ (రాజమహేంద్రవరం): 1
- జిల్లాలో క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు వాడే వారి సంఖ్య :10,802

ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖల సమన్వయంతో సేవలు, పథకాలు

- సెర్ప్ డీఆర్‌డీఏ, ఏఆర్‌టీ ద్వారా 2,497 మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ.4 వేల పెన్షన్ అందిస్తున్నారు.
- ఆగస్టు 12న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా 'మీకు తెలుసా' అని విస్తృత స్థాయి హెచ్‌ఐవీ/ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి ఇప్పటి వరకూ 300కు పైగా అవగాహన సదస్సులు నిర్వహించారు.
- జిల్లాలో యువతలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు జిల్లా స్థాయి 5కే రన్ మారథాన్ నిర్వహించారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించారు.
- హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు జీవితకాల ఏఆర్‌టీ మందులు ఉచితంగా అందించడంతో పాటు వారికి ఉచితంగా హెపటైటిస్–బీ, సీ పరీక్షలు చేసి ఉచితంగా వ్యాక్సిన్ కూడా ఇస్తున్నారు.
- జిల్లాలోని అన్ని సబ్ జైళ్లలో ప్రతి ఒక్కరికీ హెచ్‌ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్–బీ, హెపటైటిస్–సీ, టీబీ పరీక్షలు ప్రతి వారం నిర్వహిస్తున్నారు.
- జిల్లాలో ఉన్న ఫ్యాక్టరీస్ మరియు ఇండస్ట్రీస్‌లలో పని చేస్తున్న సిబ్బందికి హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలతో పాటు ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తున్నారు.
- రక్తం కొరత లేకుండా సురక్షిత రక్తమార్పిడి ద్వారా హెచ్‌ఐవీ శాతాన్ని తగ్గించడానికి దోహదపడుతున్నారు.
- నాకో, సాక్స్ భాగస్వాములు మరియు దాతల సహకారంతో హెచ్‌ఐవీ/ ఎయిడ్స్‌తో జీవిస్తున్న చిన్నారులకు విలువైన సమతుల ఆహారాన్ని అందిస్తున్నారు.
- జిల్లాలో హెచ్‌ఐవీ బాధితులందరికీ మరియు హైరిస్క్ గ్రూపు వారందరికి హెచ్‌ఐవీ పరీక్షతో పాటు దీర్ఘకాలిక జబ్బులైన హెపటైటిస్–బీ, సీ, సిఫిలిస్ పరీక్షలు నిర్వహించి హెపటైటిస్–బీ, సీ వ్యాక్సినేషన్ వేస్తున్నారు.
- విద్యాశాఖ ద్వారా ఎన్‌ఎస్‌ఎస్ సహకారంతో అన్ని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్ కార్యక్రమాలు అమలు చేస్తూ యువతీ యువకులకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్, సుఖ వ్యాధులపై సంపూర్ణ అవగాహన కల్పించడంతో పాటు స్వచ్ఛంద రక్తదానానికి ప్రోత్సహిస్తున్నారు.

వ్యాధి కట్టడికి చర్యలు



జిల్లాలో హెచ్‌ఐవీ వ్యాధి అదుపులో ఉంది. దీని తీవ్రత గురించి తెలుసుకున్న చాలా మంది జాగ్రత్త పడుతున్నారు. హెచ్‌ఐవీ సోకిన బాధితులకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాం. ఎయిడ్స్ నుంచి బాధితుల రక్షణకు ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ చేస్తున్న కృషి ఫలిస్తుంది. జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖల సహకారంతో ప్రజలకు విస్తృతంగా హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్నాం. గర్భిణుల నుంచి పిల్లలకు ఎట్టి పరిస్థితిలో వ్యాధి సోకకుండా కట్టడి చేస్తున్నాం.

–ఎస్.వసుంధర, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణ అధికారి, తూర్పుగోదావరి

జిల్లాలో పరిస్థితి ఇదీ..

సంవత్సరం	గర్భిణులకు పరీక్షలు	హెచ్‌ఐవీ సోకిన గర్భిణులు	ఇతరులకు పరీక్షలు	హెచ్‌ఐవీ సోకిన ఇతరులు
2022–23	20,164	24	46,201	723
2023–24	17,855	21	45,763	470
2024–25 (అక్టోబర్ వరకూ)	5,403	03	32,066	280

విద్యార్థుల్లో సృజనాత్మకతకు కొదవ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వాసుదేవరావు

రాజానగరం: నేటితరం విద్యార్థుల్లో సృజనాత్మకతకు కొదవ లేదని, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తే గొప్ప విజ్ఞానవేత్తలుగా తయారవుతారని డీఈఓ కె.వాసుదేవరావు అన్నారు. గోదావరి గ్లోబెల్ యూనివర్సిటీ (జీజీయూ)లో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ) బూట్ క్యాంప్' శనివారంతో ముగిసింది. జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (హైదరాబాద్) సీఈఓ డాక్టర్ ఎస్.సెంథిల్ వినాయగం మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు తమ మద్దతు ఉంటుందన్నారు. విశాఖపట్నానికి చెందిన ఎంఎస్ఎంఈ మెకాట్రానిక్స్ హెడ్ డాక్టర్ కె.మురళీకృష్ణ, వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి విశాల్ నాయర్, ఐపీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ మేనేజర్ డాక్టర్ ఐఎస్ భీమలింగారెడ్డి, బూట్ క్యాంప్ నోడల్ అధికారి టి.జయానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కడలి కల్లోలం

- తీరంలో ఎగసి పడుతున్న అలలు
- ఫెంగల్ తుపానుతో వణుకు
- కూలుతున్న మత్స్యకార గృహాలు

కొత్తపల్లి: కడలిలో కల్లోలం రేగింది.. అలల తాకిడి అధికమైంది.. ఫెంగల్ తుపాను ప్రభావంతో కొత్తపల్లి మండలంలో సముద్ర తీరం ఉధృతంగా మారింది.. మత్స్యకారుల గృహాలపై అలలు విరుచుకు పడుతుండడంతో ఆందోళన నెలకొంది. ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంతాల్లో ఉన్న ఇళ్లు కోతకు గురవుతున్నాయి. తీరంలోని మత్స్యకార గృహాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకు రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తీర ప్రాంతానికి రక్షణగా వేసిన జియోట్యూబ్ రాళ్లు సైతం అలల తాకిడికి చెల్లాచెదురవుతున్నాయి. కెరటాల తాకిడికి ఉప్పాడ– కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురైంది. బీచ్ రోడ్డులో రక్షణ గోడగా వేసిన బండరాళ్ల గోడ సైతం కెరటాల ఉధృతికి ధ్వంసమవుతోంది. కెరటాలు రోడ్డుపైకి ఎగసి పడుతుండటంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. కొత్తపల్లి మండలంలో తుపాన్ కారణంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. తీర ప్రాంతంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తుపాన్ నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశామన్నారు.

తీరంలో 'పసిడి' వేట

ఉప్పాడ శివారు పాత మార్కెట్ సమీపంలోని తీర ప్రాంతంలో పసిడి వేట సాగిస్తున్నారు. స్థానిక మత్స్యకారులు బంగారం కోసం వెతుకులాడుతున్నారు. ఇప్పటికే మహిళలకు బంగారు రేణువులు, రూపులు, దుద్దులతో పాటు పలు బంగారు, వెండి వస్తువులు లభ్యమయ్యాయి. గతంలో పెద్ద బంగ్లాలు, పలు దేవాలయాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయని, అందులో ఉన్న వస్తువులు తుపాన్ సమయంలో బయట పడుతున్నాయని ప్రచారం జరుగుతోంది. సముద్ర తీరం వద్దకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నా కొందరు లెక్క చేయకుండా బంగారం కోసం వేట సాగిస్తున్నారు.



కాకినాడ దుమ్ములపేట వద్ద ఒడ్డుకు చేరిన మత్స్యకారుల బోట్లు



ఉప్పాడ తీరంలో బంగారం కోసం మత్స్యకారుల వెతుకులాట



ఉప్పాడ తీరంలో కూలిపోయిన ఇల్లు

ఒడ్డుకు మత్స్యకారుల బోట్లు

కాకినాడ రూరల్: తుపాన్ ప్రభావంతో కాకినాడ తీరంలో మత్స్యకార బోట్లు ఒడ్డుకు చేరుకున్నాయి. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులతో పాటు సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. కాకినాడలో శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకూ వర్షం పడింది. రోజంతా వాతావరణం చల్లగా మారి, బలమైన చలిగాలులు వీచాయి. అమావాస్యలో వచ్చే తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అందుకే సముద్రంలో వేటను విరమించుకుని ఒడ్డుకు చేరుకున్నట్టు దుమ్ములపేట మత్స్యకారులు తెలిపారు.

షాపు యజమానిపై దాడి



గాయపడిన నారాయణమూర్తి

రౌతులపూడి: స్థానిక ప్రధాన రహదారిలో శ్రీలక్ష్మీ శ్రీనివాసా బ్యాంకర్స్ షాపు యజమాని రోతు నారాయణమూర్తిపై శనివారం ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. ఉదయం తొమ్మిది గంటల సమయంలో మోటారు సైకిల్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా షాప్‌లోకి ప్రవేశించి ఇనుప రాడ్డుతో నారాయణమూర్తి తలపై దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన అతను అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కాకినాడకు తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

యువకుడి దుర్మరణం

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని పటవల పైడా కళాశాల వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ కథనం ప్రకారం.. మారేడుమిల్లి గ్రామానికి చెందిన తుంబుడు సుబ్బారెడ్డి (24) కాకినాడలోని ఒక హోటల్‌లో పని చేస్తున్నాడు. తన స్నేహితుడి పుట్టినరోజును యానాంలో జరుపుకొని తిరిగి బైక్‌పై వస్తుండగా వర్షం కారణంగా బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు సుబ్బారెడ్డికి ఇంకా వివాహం కాలేదు. చేతికి అందివచ్చిన కుమారుడు అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల మృతుని తండ్రి వెంకట్రావు బోరున విలపించారు.

జనవరి 19న మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ మేనేజర్ రాజా

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ సౌత్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 19న సికింద్రాబాద్ నుంచి మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర ప్రత్యేక భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వీఐపీ లాంజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రత్యేక రైలుకు సంబంధించిన కరపత్రాలను స్టేషన్ మేనేజర్ రంగనాథ్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19న బయలు దేరే రైలు 26వ తేదీ వరకూ నడుస్తుందన్నారు. సికింద్రాబాద్ నుంచి బయలు దేరే ఈ రైలు యాత్ర విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని మీదుగా సాగుతుందన్నారు. వారణాసిలో కాశీవిశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షి అన్నపూర్ణా దేవి ఆలయం, సాయంత్రం గంగా హారతి, అయోధ్యలో సరయూ నది వద్ద రామజన్మ భూమి, హనుమాన్ గర్హి, ప్రయాగ్‌రాజ్ వద్ద త్రివేణి సంగమం దర్శించనున్నారన్నారు. బుకింగ్ వివరాల కోసం 92814 95848, 89773 14121 నంబర్లను సంప్రదించాలన్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీలు



సాఫ్ట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పు గోదావరి జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న అండర్–17 అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ఐ సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఫైనల్స్‌లో తూర్పు, విజయనగరం జట్లు పోటీ పడగా విజయనగరం విజయం సాధించింది. ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి, తృతీయ స్థానంలో కడప జట్టు నిలిచింది. ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జి.శ్యాంకుమార్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, టి.హరీష్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌జీఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి, సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి సూకరాజు, ట్రెజరర్ కౌర్, పీడీలు సూరిబాబు, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కొత్తపల్లి: ప్రమాదవశాత్తూ చెరువులో పడి శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఉలవల వీరబాబు (53) శనివారం స్థానికంగా ఉన్న కోటలంక చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. దీనిపై గొల్లప్రోలు పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.